క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, భక్తులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ అన్నపూర్ణనగర్ కాలనీ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మాజీ సర్పంచ్ ఎస్.యాదగిరి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ పి.సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలకు డిమాండ్


ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: విద్యార్థులతో రాత్రి వేళలో ప్రచారం చేయిస్తున్న మండల పరిధి నేదునూరు సెయింట్ జోసెఫ్ పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ నగర కార్యదర్శి ఢిల్లీ భానుప్రసాద్, టౌన్ జాయింట్ సెక్రటరీ అమరేందర్, వీరపట్నం హాస్టల్ జిల్లా కన్వీనర్ జ్యోతిప్రసాద్ మాట్లాడారు. ఒంటిపూట బడులు కొనసాగుతున్న నేపథ్యంలో రాత్రి 8.30 గంటలకు కందుకూరు చౌరస్తాలో విద్యార్థులతో కలిసి వీధుల్లో ప్రచారం చేయడమేంటని ప్రశ్నించారు. సీబీఎస్ఈ అనుమతి లేకున్నా, ఉందని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, యువకులు ఢిల్లీ అనిల్, నరేందర్, సాయిబాబా, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి


విద్యార్థులతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి తదితరులు

మీర్‌పేట: చిన్ననాటి నుంచే పిల్లలకు చదువుతో పాటు, అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. మీర్‌పేట గాయత్రీనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో గురువారం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోజులో కొంత సమయాన్ని వారితో గడపాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ప్రమీల, ప్రధానోపాధ్యాయురాలు అరుణజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి


విద్యార్థులతో డైరెక్టర్ శశికళశర్మ

నందిగామ: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని హిప్పో క్యాంపస్ విద్యాసంస్థల డైరెక్టర్ శశికళశర్మ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ హిప్పో క్యాంపస్‌లోని విద్యార్థులు రచించిన పలు పుస్తకాలను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కని సృజనాత్మకతతో లోతైన అధ్యాయనం చేసి, ఆంగ్ల భాషపై చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించి తమ జీవితంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా పలు పుస్తకాలు రచించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కేవలం చదువుపై మాత్రమే కాకుండా వారికి ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ


తుక్కుగూడ పురపాలిక సంఘం కార్యాలయం

ఎర్లీబర్డ్‌తో ఏప్రిల్ 30వరకు అవకాశం

- పన్ను వసూలుపై దృష్టి సారించిన మున్సిపాలిటీ అధికారులు



సీడీఎంఏ కమిషనర్‌ను నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ(ఎర్లీబర్డ్)ను ప్రకటించింది. 2025– 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ఈ నెల 30లోగా చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ(సీడీఎంఏ) ఉత్తర్వులు జారీ చేసింది.

పన్ను వసూలుపై నజర్

తుక్కుగూడ పురపాలిక సంఘం గత ఏడాది 2024– 25 ఆర్థిక సంవత్సరంలో రూ.6.25 కోట్ల పన్ను వసూలు లక్ష్యం కాగా.. రూ.5.5 కోట్లు (88.88 శాతం) వసూలు చేసింది. పన్ను వసూలులో మున్సిపాలిటీ.. జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచింది. ఇంకా రావాల్సింది కేవలం రూ.75 లక్షలు మాత్రమే. పాత బకాయితో కలిపి సుమారు రూ.7 కోట్ల వరకు ఈ ఏడాది ఆదాయ పన్ను లక్ష్యం కానుంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇవ్వనుందని పుర అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

> **వినియోగించుకోవాలి**
>
> 2025– 2026 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీని ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు అందాయి. పుర ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి, రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే, మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి.
>
> – ఎ.వాణి, మున్సిపల్ కమిషనర్, తుక్కుగూడ

ప్రశంసాపత్రం

గడిచిన ఏడాది 2024– 25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను 88.88 శాతం పుర అధికారులు, సిబ్బంది వసూలు చేశారు. దీంతో పురపాలిక సంఘం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకు గాను గురువారం నగరంలోని సీడీఎంఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి.. మున్సిపల్ కమిషనర్ ఎ.వాణికి ప్రశంసాపత్రం అందజేశారు. దీంతో పలువురు కమిషనర్‌కు అభినందనలు తెలియజేశారు.

ఇజ్రాయేల్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్


ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రవాపు ఇజ్రాయేల్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాలులోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎర్రవాపు ఇజ్రాయేల్ దశదిన కర్మ కార్యక్రమంలో కేఎల్లార్ పాల్గొని.. ఇజ్రాయేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రవాపు ఇజ్రాయేల్ కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేశారన్నారు. న్యాయవాదిగా పనిచేస్తూ పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడంతో పాటు సేవలు అందించారన్నారు. ఇజ్రాయేల్ కుటుంబానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. అంతకుముందు అతని భార్య, కుమార్తెలు, సోదరులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సమత, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, పార్టీ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, ప్రశాంత్‌రెడ్డి, మల్లేశ్, కరుణాకర్‌రెడ్డి, శివ, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

తవ్వారు.. మరిచారు

- ప్రమాదకరంగా పైప్‌లైన్ గుంత

మొయినాబాద్‌రూరల్: పదిరోజులైనా పైపులైన్ లీకేజీ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధి హిమాయత్‌నగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై పదిరోజుల క్రితం అధికారులు పైపులైన్ లీకేజీ మరమ్మతుల కోసం గుంత తీసి వదిలేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గుంతను గమనించకుండా వెళ్తే అందులో పడిపోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఏ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

భూముల విక్రయాన్ని విరమించుకోవాలి



నిరసన వ్యక్తంచేస్తున్న బీజేవైఎం నాయకులు

మీర్‌పేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములు జీవ వైవిధ్యానికి నిలయమని, అలాంటి భూములను అమ్ముకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ ఆరోపించారు. భూ విక్రయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మీర్‌పేట కూడలిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషమని, వారికి బీజేవైఎం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా, పోలీసులు అడ్డుకుని కార్యకర్తలను అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, నాయకులు గాజుల మధు, గోలి శ్రీనివాస్ రెడ్డి, సాధు వేణుగోపాల్‌రెడ్డి, మన్యం రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, నవీన్‌గౌడ్, భాస్కర్, ఠాకూర్ నిఖిల్‌సింగ్, భరత్‌సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అంటే ప్రజలదికాదా?

- హెచ్‌సీయూ భూములను వదిలేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి

మొయినాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400ల ఎకరాల భూమిని ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ప్రశ్నించారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రభుత్వ భూములను అమ్మొద్దని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎందుకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ భూమి అంటే ప్రజలది కాదా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూకు చెందిన 400ల ఎకరాల భూమి జీవవైవిధ్యానికి నెలవుగా ఉందని, హైదరాబాద్ మహానగరానికి పచ్చదనాన్నిచ్చే భూముల్లో బుల్డోజర్లు దింపి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా హెచ్‌సీయూ భూములను వదిలేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొత్త మాణిక్ రెడ్డి, మోర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


కొత్తగూడ పరిధి పొలాల్లో నిలిచిన వర్షం నీరు


జలమయమైన మిథులానగర్ కాలనీ


మిథులానగర్ కాలనీలో వరదనీటిలోనే నిలిచిన పాఠశాల బస్సు

జలమయమైన లోతట్టు కాలనీలు

మీర్‌పేట: చినుకు పడితే అంతే.. ఇక భారీ వర్షం పడితే కాలనీల్లోని వీధులన్నీ జలమయం కావాల్సిందే. గురువారం కురిసిన భారీ వర్షానికి మీర్‌పేట మంత్రాల చెరువు కింద ఉన్న లోతట్టు ప్రాంతాలైన మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీల్లో భారీగా వరదనీరు వచ్చి చేరింది. మోకాలిలోతు వరకు నీరు చేరడంతో బయటి నుంచి వచ్చే వారు ఇళ్లలోకి, ఇళ్లలో ఉన్న వారు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం వేళ కావడంతో పాఠశాలల బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓ పాఠశాల బస్సు వరదనీటిలోనే కూరుకుపోయింది. వర్షం పడిన ప్రతీసారి పైనున్న కమలానెహ్రూనగర్, దాసరి నారాయణరావు కాలనీ, లక్ష్మీనర్సింహ కాలనీ, సాయినగర్ కాలనీల నుంచి వచ్చే వరదనీరంతా తమ కాలనీలను ముంచెత్తుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. వరదనీరు తాత్కాలికంగా వెళ్లేందుకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

పైపులైన్ పనులు పూర్తి చేయాలి

చందన చెరువు నుంచి మంత్రాల చెరువు వరకు రూ.90లక్షల అంచనా వ్యయంతో వరదనీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా పైపులైన్ వేసేందుకుగాను గతంలోనే సాంక్షన్ తీసుకోవడం జరిగిందని కాలనీవాసులు తెలిపారు. ఇట్టి పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేస్తే భవిష్యత్తులో మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలకు ముంపు సమస్య నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కావున కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై డీఈ వెంకన్నను వివరణ కోరగా.. మీర్‌పేట మున్సిపాలిటీ నూతన కార్యాలయ భవనం నుంచి మిథులానగర్ చర్చి వరకు నూతన డ్రైనేజీ పైపులైన్ వేసేందుకు గాను రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కందుకూరు: కందుకూరు మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి కుండపోతగా వర్షం కురవడంతో రోడ్ల వెంబడి, పొలాల్లో వర్షం నీరు నిలిచింది. మరోపక్క వేసవి తాపంతో ఇబ్బందిపడ్డ ప్రజలకు ఒకేసారి వాతావరణం చల్లగా మారడంతో ఉపశమనం లభించినట్లయింది.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లె పద్మమ్మ, వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు పల్లె అనంద్‌కుమార్ మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విశాల పాల్గొని చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్, సురేశ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రాములు, గ్యార సురేశ్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మీర్‌పేట: దేశ పర్యటనకు వచ్చిన జర్మనీ యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సామాజిక వేత్త, అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపాక సన్నీకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్యాటక ప్రాంతాలు చూపిస్తానని మాయమాటలతో నమ్మించి విదేశీ యువతిపై అత్యాచారం చేసిన అబ్దుల్ అస్లాం, అతనికి సహకరించిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి సంఘటనలతో దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. దేశాన్ని సందర్శించేందుకు వచ్చే విదేశీయులకు ప్రభుత్వాలు తగిన భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య

- వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ధీరుడు
- ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి, కుర్మసంఘం నేతలు
- ఘనంగా కొమురయ్య జయంతి


మహేశ్వరం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కుర్మ సంఘం నాయకులు


కందుకూరు: కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మహేశ్వరం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు పోల్కం బాలయ్య ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోరాటతత్వానికి నిదర్శనం దొడ్డి కొమురయ్య అని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన ధీరుడు అని కొనియాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. అంతకు ముందు దొడ్డి కొమురయ్య అమర్ హై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం, జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, కురుమ సంఘం మాజీ మండల అధ్యక్షుడు పెంట రాయప్ప, మండల ఉపాధ్యక్షుడు గుత్తి పాండు, కోశాధికారి భాస్కర్, గుత్తి సురేష్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, సుధాకర్ రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్యయాదవ్, బీజేపీ జిల్లా నాయకుడు వెంకటేశ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, ఎం.బాల్‌రాజ్, యాదగిరి, మనోహర్ పలువురు పాల్గొన్నారు.


తుక్కుగూడ: కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుర్మసంఘం నేతలు

కందుకూరులో..

కందుకూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కుర్మసంఘం నాయకులు అన్నారు. కొమురయ్య జయంతి సందర్భంగా గురువారం సంఘం మండల అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు ఎగ్గిడి ఐలయ్య ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన మహనీయుడని కొమురయ్య అని కొనియాడారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్గిడి ఐలయ్య, గౌర ప్రభాకర్, బక్క మల్లేశ్, జగదీశ్వర్, బండ నర్సింహ, ఎ.కృష్ణ, ఎం.జంగయ్య, ఎం.రమేష్, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మీర్‌పేటలో..సీపీఎం నాయకులు

తుక్కుగూడలో..

తుక్కుగూడ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని తుక్కుగూడ పురపాలిక కేంద్రంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు గొరిగే దేవేందర్, తెల్ల కొమురయ్య, అంజయ్య, శ్రీకాంత్, పవన్, సత్యానారాయణ, బాబురావు, వెంకటేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: చందన చెరువు కట్ట వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ మండల నాయకులు శేఖర్‌యాదవ్, దాసరి బాబు కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనను కొమురయ్య వ్యతిరేకించడంతో పాటు సాయుధ పోరాటంలో భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేశారని వారు గుర్తుచేశారు. నిజాం గూండాల తూటాలకు బలైన సాయుధ పోరాట తొలి అమరుడు కొమురయ్య అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి రఘు, యాదయ్యచారి, స్థానిక నాయకులు బీరప్ప, అంజయ్య పాల్గొన్నారు.